క్లుప్తంగా

రేణుకాఎల్లమ్మ దేవి జాతర షురూ



రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో హోమంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మ దేవాలయం ఆవరణలో ఉన్న రేణుకాఎల్లమ్మ దేవి జాతర ప్రారంభమైంది. శనివారం చండీ నవగ్రహ సహిత గణపతి హోమం జరుగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం ప్రధాన జాతర ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

అనారోగ్య సమస్యతో యువతి ఆత్మహత్య

జీడిమెట్ల: అనారోగ్య సమస్యతో భాదపడుతున్న ఓ యువతి ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. సూరారం డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన శ్రీనివాసరావుకు నలుగురు కుమార్తెలు. మొదటి కుమార్తె దీపిక తర్వాత ముగ్గురు కుమార్తెలు ఒకే కాన్పులో జన్మించారు. ఇందులో ఒక అమ్మాయి దివ్య(21) డిగ్రీ చదువుతోంది. ఆమెకు కొన్ని సంవత్సరాలుగా థైరాయిడ్ సమస్య ఉంది. ఈ విషయమై తనలో తానే మదనపడేది. కాగా శుక్రవారం రాత్రి భోజనం చేసిన అనంతరం అందరు నిద్రకు ఉపక్రమించారు. ఉదయం 5గంటలకు నిద్రలేవగా దివ్య కనిపించలేదు. దివ్య కోసం వెతకగా ఇంటి సందులో ఉన్న రేకుల పైపునకు చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. మృతురాలి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



దూలపల్లి దుర్గాకాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పాతకాలపు డ్రైనేజీ లైన్లనే నేటికి వినియోగిస్తుండటంతో పలు గల్లీల్లో డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతోంది. దూలపల్లి 14వ వార్డు పరిధిలోని దుర్గాకాలనీలో కొన్ని రోజులుగా మ్యాన్‌హోళ్ల జామై మురుగు రోడ్లపైకి చేరుతోంది. దీంతో స్థానిక ప్రజలు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

సుభాష్‌నగర్: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని.. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని సుభాష్‌నగర్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని శివహిల్స్, శివాలయనగర్, రాజీరెడ్డినగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రధాన రోడ్లపై పేరుకుపోయిన చెత్తను రాంకీ సంస్థ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోయకూడదని కోరారు. చెత్త సేకరణ ఆటోవాలాలకు అందించాలని స్థానికులు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, విజయ్‌కుమార్, తిరుపతి, పద్మావతి, సంగమేశ్వరుడు, సత్యనారాయణ, జహంగీర్, రాజుగౌడ్, రాంకీ సంస్థ ప్రతినిధులు ఆరిఫ్, డివిజన్ ఇన్‌చార్జ్ దేవిక తదితరులు పాల్గొన్నారు.

యజమానులు రాకపోతే వాహనాల వేలం

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న 527 వాహనాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల యజమానులు సైబరాబాద్ వెబ్‌సైట్‌లో చూసుకొని తమ వాహనం ఉంటే అభ్యంతరాలు ఉన్న ఎడల వాటిని తిరిగి పొందేందుకు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌ఓను సంప్రదించాలని సూచించారు. ఎవరూ రాకపోతే వాహనాలను వేలం వేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఎంటీఓ ఎస్ విష్ణును సెల్‌ఫోన్ నంబర్ 9490617317లో సంప్రదించాలని కోరారు.

అలరించిన 'సంగీత విభావరి'

హఫీజ్‌పేట్ : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో నగరానికి చెందిన అజంతా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సినిమా పాటలు వృద్ధులను ఆకట్టుకున్నాయి. అనంతరం గాయకులు సౌజన్య, సారధి, శ్రావణ్, సౌమ్య, రవి, సాహితిలను సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు అభినందించారు.

54 గల్లీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి శ్రీకారం

- కేవలం ఒకే ఒక గల్లీలో పనులు పూర్తి
- మిగతా గల్లీల్లో రోడ్లను తవ్వి వదిలేసిన వైనం
- నెలన్నర నుంచి రాకపోకలకు ఇబ్బందులు
- పత్తా లేకుండా పోయిన కాంట్రాక్టర్

చింతల్: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ వాసుల పరిస్థితి. చినుకు పడితే చిత్తడిగా మారే ఈ బస్తీ నేడు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మరింత అందవిహీనంగా తయారైంది.

◆ బస్తీలో ఇటీవలే తాగునీటి పైపులైన్ పనులు పూర్తయిన అనంతరం రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సంకల్పించారు. ఈ విషయంలో నెలన్నర క్రితం స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కార్పొరేటర్ రషీదాబేగంలు కలిసి భగత్‌సింగ్‌నగర్‌లోని సుమారు 54 గల్లీలలో నూతనంగా సీసీ రోడ్లు వేసేందుకు శంకుస్థాపన చేశారు.

◆ అనంతరం టెండర్లు పూర్తవడంతో అన్నీ గల్లీల్లో రోడ్డు వేయాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ ఒకే గల్లీలో పనులు పూర్తి చేశాడు. కొన్ని గల్లీలలో రోడ్డు వేసేందుకు తవ్వకాలు చేపట్టి తదనంతరం పత్తా లేకుండా పోయాడు. ఇది జరిగి నేటికీ సుమారు నెలరోజులు కావస్తోంది. భగత్‌నగర్‌లో ఒకే రోడ్డు దిక్కవడంతో స్థానిక ప్రజలు రాకపోకలు సాగిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



భగత్‌సింగ్‌నగర్‌లోని ఓ గల్లీలో కంకర పోసి నిలిపి వేసిన రోడ్డు పనులు



ఓ గల్లీలో రోడ్డు పనుల్లో భాగంగా ఇళ్ల ముందున్న మెట్లను తొలగించిన దృశ్యం (సర్కిల్‌లో)

◆ పలు గల్లీల్లో రోడ్డు వేసేందుకు ఇళ్ల ముందున్న మెట్లు, ర్యాంప్‌లను తొలగించడంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ర్యాంప్‌లు తొలగించడంతో వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఇళ్లు సుమారు నాలుగైదు ఫీట్ల ఎత్తులో ఉండటంతో వారికి మెట్లే ఆధారం.

◆ దీంతో తవ్వి అలాగే వదిలేయడంతో నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు చోద్యం చూస్తుండటంతో భగత్‌సింగ్‌నగర్ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ 17వ డివిజన్ పరిధిలోని కౌసల్య కాలనీ, సాయికృష్ణజహిల్స్ ప్రాంతాల్లో మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ దన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి ప్రగతియాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపడుతున్న లైబ్రరీ భవనం, ఎస్‌ఎస్‌డీపీ నాలా నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిజాంపేట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కోట్లాది నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, స్థానిక కార్పొరేటర్లు ఆగం రాజుముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి' పనులు సత్వరమే పూర్తి చేయాలి

కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన పనులన్నీ యుద్ధప్రాతిపదికన మార్చి మాసం కల్లా పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పనుల జాప్యానికి సంబంధించి అలసత్వం ప్రదర్శించిన అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి పెండింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను కలెక్టర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి 'మన ఊరు-మన బడి'పై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'మన ఊరు-మన బడి'ద్వారా మొదటి విడతలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, ఆలస్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. జిల్లాలో 176 పాఠశాలలను 'మన ఊరు-మన బడి'కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు.

టౌన్ లెవెల్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం



టౌన్ లెవెల్ ఫెడరేషన్ నూతన కార్యవర్గంలో ప్రాజెక్ట్ అధికారి హరిప్రియ

కుత్బుల్లాపూర్: టౌన్ లెవెల్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ప్రాజెక్టు అధికారి హరిప్రియ సమక్షంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అధ్యక్షురాలిగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా ఆసియా, కోశాధికారిగా రమ్యకుమారి, రిసోర్స్ పర్సన్‌గా వెంకటేశ్వరమ్మను ఎన్నుకున్నారు. అదే విధంగా 52 మంది ఎస్‌ఎల్‌ఎఫ్ గ్రూపు అధ్యక్షులతో పాటు ఆర్పీలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఎస్‌ఎల్‌ఎఫ్ నుంచి ఎస్‌హెచ్‌జీ ఆధార్‌కార్డు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. తీసుకోని వారికి వడ్డీ లేని రుణాలు రావని పేర్కొన్నారు.

జీఓ 59ను త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: జీఓ 59 కింద ఇప్పటి వరకు ఇంకా పూర్తి కాని దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదని కలెక్టర్ అమయ్ కుమార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో జీఓ 59, రెండు పడకల ఇళ్ల ప్రగతిపై జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్యతో కలిసి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. క్రమబద్ధీకరణకు సంబంధించి మూడు విడతలుగా డబ్బులు చెల్లించటానికి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అవకాశం కల్పించాలన్నారు. ముగింపు దశలో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మార్చి కల్లా పూర్తి చేయాలన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి



కుత్బుల్లాపూర్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఉపకమిషనర్ మంగతాయారు

కుత్బుల్లాపూర్: వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని.. స్కూలుకు వచ్చేటప్పుడు కుక్కలకు దూరంగా ఉండి మీ దారిన మీరు వెళ్లాలని... వాటిని కొట్టే ప్రయత్నం చేయరాదని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ మంగతాయారు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు తెలిపారు. కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు స్కూలుకు వచ్చేటప్పుడు కనిపించే కుక్కలను ఏమీ అనకుండా వెళ్లిపోవాలని కోరారు. ఎంటమాలజీ అధికారి ఉమారాణి, వైద్యఆరోగ్య అధికారి ప్రశాంతి, వెటర్నరీ అధికారి మనోజ్, పారిశుద్ధ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమాదేవినగర్ అభివృద్ధికి వెంకటేశ్వర్‌రాజు కృషి ఎనలేనిది

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఉమాదేవి నగర్‌లో శనివారం కాలనీ మాజీ అధ్యక్షుడు, కుత్బుల్లాపూర్ భట్రాజు సంఘం సలహాదారుడు కూరపాటి వెంకటేశ్వర్‌రాజు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షుడు కూరపాటి కురుణాకర్‌రాజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమాదేవినగర్ అభివృద్ధికి వెంకటేశ్వర్‌రాజు కృషి ఎనలేనిదని అన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలతో పాటు ఆలయాభివృద్ధికి ఆయన కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూరపాటి శివకృష్ణ, కూరపాటి వంశీకృష్ణ, ఉమాదేవినగర్ కమిటీ నాయకులు ఎస్. కృష్ణమూర్తి గుప్తా, కుమారస్వామి, చందర్‌యాదవ్, అశోక్‌చారి, భట్రాజు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తంగెళ్ల రాధాకృష్ణ భట్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్‌రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భట్రాజు సంఘం సభ్యులు

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



హైరైజ్ కాలనీలో ప్రజలతో సమావేశమైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని హైరైజ్ కాలనీలో నెలకొన్న మురుగునీటి, వరదనీటి సమస్యలపై ఇటీవల కాలనీ వాసులు ఎమ్మెల్సీని కలిసి విన్నవించి పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన శంభీపూర్ రాజు శనివారం హైరైజ్ కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న మురుగు సమస్యను స్వయంగా పరిశీలించారు.



సమావేశానికి హాజరైన హైరైజ్ కాలనీవాసులు

◆ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌లు దృష్టి సారించారని, ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతులను కల్పించారన్నారు.

◆ హైరైజ్ కాలనీలో వరదనీటి, మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని, త్వరలోనే ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

◆ ఈ కార్యక్రమంలో నిజంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, స్థానిక కౌన్సిలర్లు సంధ్య, మాదాసు వెంకటేశం, కార్పొరేటర్లు విజయలక్ష్మి, చిట్ల దివాకర్, కొలన్ వీరేందర్‌రెడ్డి, గాజుల సుజాత, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్, ఎస్‌ఎన్‌డీపీ డీఈలు నరేందర్, నళిని, బీఆర్‌ఎస్ నాయకులు ఎంబరి ఆంజనేయులు, జగన్‌యాదవ్, నీలంరెడ్డి, బాలకృష్ణ, రాఘవేంద్ర, పార్టీ శ్రేణులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను 16వ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎస్‌డీపీ నాలా, రోడ్ల వెడల్పు, డ్రైనేజీ లైన్‌లు, వైకుంఠధామాలు, బస్తీ దావాఖానా, శానిటేషన్ మంజీరనీటి సరఫరా, ఫాగింగ్, ప్లాంటేషన్, కుక్కల బెడద, పట్టణాభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. నిజాంపేట్‌ను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపీఎస్ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో జగగామలో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఈ సంస్థ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు తెలిపారు. శనివారం బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఖాసిం, రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబులు హాజరవుతారని, మనువాదం - రాజ్యం అనే అంశంపై చర్చిస్తారని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు ఎం.కృపాసాగర్ జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మణ్, అశోక్, బాలయ్య, సాయిచంద్, మహేశ్వరి మోహన్, నరసింహ, మల్లికార్జున్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు తెలిపేందుకు 'రైతుబజార్'



పాఠశాలలో రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌లోని శ్రీవివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో శనివారం రైతు బజార్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో రైతుబజార్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులే రైతులుగా మారి కూరగాయల విక్రయాలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండవ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... కూరగాయలు పండించే రైతులు ఎదుర్కొనే సమస్యలను విద్యార్థులకు తెలియజేసేందుకు రైతు బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక మధ్యవర్తులకు తక్కువ ధరలకు కూరగాయలను విక్రయించి రైతులు అనేక కష్టాలు పడుతున్నారని అన్నారు. వారి కష్టాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు కూరగాయాలు అమ్మించామన్నారు. రైతు ఎంత చమటోడిస్తే కూరగాయలు పండుతాయో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుబారా ఖర్చు



హెచ్‌ఎంటీ కంపెనీ సమీపంలో వృథాగా మారిన బస్‌షెల్టర్



కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్

రంగారెడ్డినగర్: జీహెచ్‌ఎంసీ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో అధునాత బస్‌షెల్టర్లను నిర్మించారు. అయితే ప్రధాన స్టాప్‌లలోనే కాకుండా బస్సులు ఆగని ప్రాంతాల్లో సైతం బస్ షెల్టర్లను ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని హెచ్‌ఎంటీ కంపెనీ సమీపంలో.. అదే విధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో సిగ్నల్స్ సమీపంలో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లను ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ముఖ్యంగా సిగ్నల్‌కు ఆనుకుని బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయడం అధికారుల దుబారాకు పరాకాష్టగా పేర్కొనవచ్చు.

వైద్య సేవల్లో మేడ్చల్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: వైద్య సేవల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను తెలంగాణలో మొదటి స్థానానికి చేరుకోనేలా అందరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బస్తీ, పల్లె దవాఖానాలు, కంటివెలుగు కార్యక్రమంపై వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించినట్లు జిల్లాలో వంద శాతం సాధారణ ప్రసవాలే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని సూచించారు. అలాగే బర్త్ ప్లానింగ్ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని బస్తీ దవాఖానాల్లో శాంపిల్ కలెక్షన్లు పెంచాలన్నారు. కేసీఆర్ కిట్ రిజిస్ట్రేషన్ల నవీకరణలు 95 శాతం కంటే ఎక్కువగా ఉండాలని, గర్భిణులకు సంబంధించిన కేసులను క్షేత్రస్థాయిలో సమన్వయంతో ఫాలోఅప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు ఆనంద్, నారాయణరావు, కంటివెలుగు ప్రత్యేక పర్యవేక్షణాధికారి దివ్య, ప్రోగ్రామ్ అధికారులు సంధ్య, రాంకుమార్, కౌశిక్, పాల్గొన్నారు.